

# అంకుల్ సామ్

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

***రచనాకాలం: 1995 సంవత్సరం***

*(గత సంచిక తరువాయి)*

7

**అమెరికా దేశోద్భవానికి గల** ముఖ్యకారణాల్లో ఒకటి తమకు మతపరమయిన స్వతంత్రం కావాలనుకోవడం. బాప్టిస్టులు, మెథాడిస్ట్లు క్వేకర్స్, రోమన్ కేథలిక్స్ యూదులు, కాంగ్రిగేషనలిస్టులు. ప్రెస్ బిటెరియన్స్ యూరప్‌లోని తమ జన్మభూమిని వదిలి అమెరికాకు చేరుకున్నారు.

ఈ మతాల విశ్వాసంగల కొన్ని వేలమంది ఆ తరువాత కేవలం మతపరమయిన కారణాలవల్లేకాక, అనేక ఇతర కారణాలవల్ల కూడా అమెరికాకి ప్రపంచం నలుమూలలనుంచీ వలస వెళుతూనే ఉన్నారు.

ఆ విధంగా మూడువందల ఏళ్ళ క్రితం నలభై లక్షల జనాభాగల అమెరికా ప్రస్తుతం ఇరవై కోట్ల జనాభాగల దేశంగా మారింది.

మార్చి 1790లో పాస్ చేసిన యు.ఎస్. నేచురలైజేషన్ చట్టం కేవలం తెల్లజాతి వారికి మాత్రమే ఆ దేశంలోకి ప్రవేశం కల్పించింది.

వాళ్ళవెంట వచ్చే నల్ల బానిసలకు మాత్రం మినహాయింపు వుండేది.

అమెరికన్ సివిల్ వార్ తర్వాత అబ్రహాం లింకన్ నీగ్రోలకి అమెరికన్ సిటిజన్‌షిప్ హక్కు ఇచ్చేదాకా ఆ దేశంలో పుట్టి పెరిగినా చట్టపరంగా వాళ్ళు ఆ దేశస్థులకింద లెక్కలోకి వచ్చేవారు కాదు.

1940దాకా ఏషియాకి చెందిన ఎవరూ అంత తేలిగ్గా అమెరికన్ సిటిజన్స్ అవలేకపోయేవారు.

1940 తర్వాత బ్రౌన్ స్కిన్‌గల ఏషియన్స్ చైనీస్‌తో అమెరికన్ సిటిజన్‌షిప్ తీసుకోవడంలోని అనేక నిబంధనలను సడలించారు.

1965 అక్టోబర్‌లో అప్పటి అమెరికా ప్రెసిడెంట్ లిండన్ జాన్సన్ కొత్త ఇమ్మిగ్రేషన్ చట్టం మీద లిబర్టీ ఐలండ్‌లో సంతకం చేశాడు.

కొన్ని శతాబ్దాలుగా అమెరికా అనుసరిస్తున్న వలస విధానాన్ని కూలంకషంగా మార్చిన బిల్లు అది.

న్యూయార్క్ మేయర్, సెనెటర్ హ్యూబర్ట్, హంఫ్రీ, కెన్నడీ సోదరులిద్దరు, గవర్నర్ విల్సన్ రాక్‌ఫెల్లర్, ఆ బిల్లు పాసవడానికి పాటుపడ్డ కొన్ని వందలమంది హాజరయిన ఆ ఫంక్షన్‌లో రాబోయే తరంలోని అమెరికన్ సిటిజన్స్ భవిష్యత్తుని తిరగరాసిన నియమాలుగల ఆ బిల్లుమీద సంతకం చేసి తన స్పీచ్‌లో ఇలా చెప్పాడు జాన్సన్.

"A Nation that was built by immigrants, Our stand is what you can do for our country. But, we should not be asking in what Country were you born?"

(వలసదారులచేత స్థాపించబడ్డ దేశం మనది. దేశానికి మీరేం చేస్తారు అన్నది మన సిద్ధాంతం అయి వుండాలి తప్ప, మీరే దేశంలో పుట్టారు అన్నది కాకూడదు)

ఆ చారిత్రాత్మక బిల్లు అమెరికాకి వలస వెళ్ళదలచుకున్న ప్రపంచంలోని ప్రతివారికీ ఉపయోగపడింది.

అంతదాకా కేవలం తెల్ల చర్మంగల యూరోపియన్‌లకి మాత్రమే తన తలపులను తెరిచి ఉంచిన అమెరికా, ఆ బిల్లుతో ప్రపంచంలోని అన్ని ప్రాంతాలవారికి స్వాగతం పలికింది.

ఏషియన్స్‌కి, ఏషియాలోని ఇండియన్స్‌కి కూడా ఆ బిల్లు పాసయ్యాక ఇండియా నుంచి అమెరికాకి వలస వెళ్ళడం మొదలయింది. ఏటా యూరపు నుంచి వలస వచ్చే వాళ్ళ సంఖ్య 1,20,000 మించకుండా, ప్రపంచంలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవాళ్ళ సంఖ్య 1,70,000 మించకుండా వుండాలని, ఏ దేశం నుంచైనా 20,000 మంది మించకూడదని ఆ చట్టం నిర్దేశించింది.

ఆ విధంగా అమెరికాకి వలస వెళ్ళడం ఇండియాలో కూడా మొదలయింది. ఏన్యువల్ కోటా అయిన 20,000 మందిలో నాలుగవ వంతు మంది అమెరికాకి ఉపయోగపడే స్కిల్ గల వాళ్ళే అయివుండాలని, మిగిలిన మూడువంతుల మంది అంటే పదిహేను వేలమంది అమెరికాలో వున్నవారు పిలిపించుకునే తమ కుటుంబ సభ్యులై ఉండాలని ఆ చట్టంలో ఉంది.

అప్పట్లో అమెరికాలో డాక్టర్లకు కొదవ కాబట్టి ఆంధ్రప్రదేశ్ నుంచి ఏటా కొన్నివేలమంది డాక్టర్లు అమెరికాకు 1969 నుంచి వలస వెళ్ళసాగారు (ఇప్పుడు అమెరికాలోని ప్రతి ముగ్గురు డాక్టర్లలో ఒకరు ఇండియన్)

అలా వెళ్ళిన వేలమంది డాక్టర్లలో ఒకడు శివయ్య కొడుకు వెంకటేశ్వరరావు. అతను 1971లో విశాఖ మెడికల్ కాలేజీ నుంచి డాక్టర్ పట్టా పుచ్చుకున్నాడు. ఆ తర్వాత ఎం.ఎస్ పట్టా కూడా తీసుకుని 1975లో అమెరికాకి వలస వెళ్ళాడు.

1976లో ఇండియా వచ్చి వివాహం చేసుకుని వెళ్ళాడు. 1978 అక్టోబర్ దాకా అతని భార్య ఇండియాలోనే వుంది. వెళ్ళగానే తన భార్యను అమెరికాకు వచ్చి తనతో కాపురం చేయడానికి వీలుగా ఆమెకు ఇమ్మిగ్రేషన్ అండ్ నేచురలైజేషన్ వీసా ఇవ్వవలసిందిగా అమెరికన్ ఇమ్మిగ్రేషన్ అండ్ నేచురలైజేషన్ సర్వీస్‌వారికి దరఖాస్తు పెట్టుకున్నాడు వెంకటేశ్వరరావు. ఏటా వుండే కోటాలో క్యూ సిస్టమ్‌లో ఆమె వంతు రావడానికి అంతకాలం పట్టింది.

1980, ఫిబ్రవరిలో న్యూయార్క్‌లో వాణి పుట్టింది. వెంకటేశ్వరరావు న్యూయార్క్‌లోని బెల్‌వ్యూ హాస్పిటల్‌లో పనిచేస్తూండగా, తర్వాత అనేక ఊళ్ళకి మారాడు. గత నాలుగేళ్ళుగా సెయింట్ లూయిస్‌లో ఆయన స్వంతంగా ప్రాక్టీస్ చేస్తున్నాడు.

1970లో అమెరికాకు వలస వెళ్ళిన ఆంధ్రులకు అందరికీ ఎదురయ్యే కామన్ సమస్య అతను కూడా ఫేస్ చేశాడు ఇండియాలో పుట్టిపెరిగిన అతనికి, అతని భార్య లక్ష్మికి సాంప్రదాయాలు, కట్టుబాట్లు, మర్యాదలు ఆంధ్రదేశానికి చెందినవే భర్త ఆధిక్యంలో ఉండటం. భార్య అణిగి మణిగి వుండటం, ప్రాతివత్యం మొదలయిన వాటిలో వాళ్ళకి ఎలాంటి తేడా లేదు.

కాని అమెరికాలో పెరిగిన వాళ్ళ పిల్లలు ముగ్గురికి పుట్టినప్పటి నుంచి అమెరికన్ సాంప్రదాయాలే పరిచయం. 'అలాకాదు, మనది ఇదీ సంప్రదాయం' అని చిన్నప్పటి నుంచి పిల్లలకు బోధిస్తూ వస్తున్నారు ఆ దంపతులిద్దరూ.

శ్రావణ శుక్రవారం నోము నోచుకుంటుంది లక్ష్మి. తోటి తెలుగు ముత్తయిదువులకు శెనగలు వాయనం ఇస్తుంది. సంక్రాంతికి బొమ్మలకొలువు పెడుతుంది. అయిదారు నెలలకోసారి ఆడియో కేసెట్ పెట్టుకుని సత్యనారాయణ వ్రతం చేసుకుంటారు. తెలుగు పండగలన్నీ యధావిధిగా జరుపుతారు. లక్ష్మి ఇంట్లో ఉన్నప్పుడు చీర, జాకెట్టు ధరిస్తుంది. బొట్టు పెట్టుకుంటుంది.

అయితే పది పన్నెండేళ్ళదాకా పిల్లలు కూడా పద్ధతిగానే ఉంటారు. ఆ తర్వాతే వస్తుంది తేడా.

తోటి అమెరికన్ పిల్లల్లా తామూ స్వేచ్ఛగా ఉండలేకపోవడం వీళ్ళకి లోటనిపిస్తుంది. తోటి పిల్లలు బోయ్ ఫ్రెండ్స్‌తో కార్లలో, మోటారు సైకిళ్ళమీద జాయ్ రైడ్స్‌కి వెళ్ళడం, డేటింగ్‌కి ఇద్దరూ కలిసి పిక్‌నిక్‌లకు, సినిమాలకు, నేషనల్ పార్క్‌లకు వెళ్ళడం, రాత్రి

పదిదాకా ఇంటికి రాకపోయినా ఆ పిల్లల తల్లిదండ్రులు పట్టించుకోకపోవడం గమనిస్తారు. తమకు ఆ స్వేచ్ఛ నివ్వకుండా తల్లిదండ్రులు కట్టడి చేయడం టీనేజ్‌లోకి వచ్చిన పిల్లలకు నచ్చదు. చిన్నప్పటి నుంచీ వాళ్ళకి అమెరికన్ వాతావరణంలో తమ ఇండియన్ వాతావరణం కనబడదు. 'తమకు సంస్కృతి ప్రకారం తామెందుకు నడుచుకోవాలి?' అన్న ప్రశ్న వాళ్ళలో మెదులుతూంటుంది. అమెరికన్స్‌కి తప్పులేని ఆచారాలు తమ కెందుకు తప్పు అనిపిస్తూంటుంది.

'నేను అమెరికనా, లేక ఇండియనా? అమెరికాలో వుంటూ తనకు పరిచయం లేని ఇండియాలోని మనిషిలా ఎందుకు మసలుకోవాలి?' అనిపిస్తుంది. ఈ ఐడెంటిటీ క్రైసెస్‌ని టీనేజ్‌లోని వాళ్ళందరూ ఎదుర్కొంటూంటారు.

తోటి అమెరికన్ స్నేహితురాలింట్లో ఆమె బోయ్ ఫ్రెండ్ నుంచి ఫోన్ వస్తే రిసీవర్ లిఫ్ట్ చేసిన ఆమె తండ్రి "లిండా! కాల్ ఫ్రమ్ స్టీవెన్!" అని రిసీవర్ కూతురికి ఇస్తాడు. అదే తమ ఇంట్లో తనకు స్టీవెన్ నుంచి ఫోన్ వస్తే, తన తండ్రి అమెరికన్ తండ్రిలా ప్రవర్తించడు లేదని అబద్ధం చెప్పి, ఫోన్ పెట్టేసి, 'వాడెవడు? ఎందుకు నీకు ఫోన్ చేయాలి? మనం అమెరికన్స్ కాదు, ఇండియన్స్. హిందువులం' అని తండ్రి గదమాయిస్తే సర్దుకుపోలేరు, తను కూతురు వయసులో ఎలా ఉండేదో తల్లి ఉదాహరణతో సహా చెపుతుంది. ఆ జీవన విధానం రుచించదు అక్కడి పిల్లలకు.

ఏతావాతా సెకండ్ జనరేషన్‌కు చెందిన వాళ్ళకు తల్లిదండ్రులతో ఘర్షణ తప్పదు.

(అమెరికాకు వలస వెళ్ళినవారు ఫస్ట్ జనరేషన్ వాళ్ళకు పుట్టిన సంతానం సెకండ్ జనరేషన్. మళ్ళీ వాళ్ళకు పుట్టినవాళ్ళు థర్డ్ జనరేషన్‌గా పిలవబడుతున్నారు.)

ఈ బేక్‌గ్రౌండ్‌తో పదమూడో ఏడు నిండుతున్న వాణికి, ఆమె తల్లిదండ్రులకు కూడా ఘర్షణ తప్పలేదు.

యౌవనంలోకి ప్రవేశించిన అమెరికన్ అమ్మాయి 'తొలి డేటింగ్' గురించి కలలు కంటుంది. తనను డేటింగ్‌కి అబ్బాయిలు ఎప్పుడెప్పుడు పిలుస్తారా అని ఆత్రంగా ఎదురు చూస్తూంటుంది. తన ఈడూ అమ్మాయి ఎవరితోనయినా డేటింగ్‌కి వెళితే ఈర్ష్య పడుతుంది. తన అందం మీద నమ్మకం కలగడం, కలగకపోవడం అన్నది అబ్బాయిలు తనను డేటింగ్‌కి తీసుకెళ్ళడం మీద ఆధారపడి వుంటుంది.

'గోయింగ్ స్టడీ' అనే పదం అమెరికాలో వుంది. అంటే ఓ అబ్బాయితో రెగ్యులర్‌గా డేటింగ్‌కి వెళ్ళడం. 'బ్లయిండ్ డేట్' అంటే తనకు పరిచయం లేని అబ్బాయితో ఎవరి ద్వారానో అయిన ఏర్పాటువల్ల డేటింగ్‌కి వెళ్ళడం.

డేటింగ్‌కి వెళ్ళడం అంటే సినిమాకి, పిక్నిక్‌కి, డిస్కోలకి వెళ్ళడం, ఒకర్నొకరు వాళ్ళు తమ లైఫ్ పార్టనర్‌గా పనికివస్తారా, లేదా అని అర్థం చేసుకోడానికి, తమ అభిరుచులు కలిశాయా, లేదా అని తెలుసుకోడానికి డేటింగ్ పద్ధతి అమెరికాలో ఏర్పడింది. అక్కడ ఎవరి జీవిత భాగస్వామిని వాళ్ళే ఎన్నుకునే సంప్రదాయం వుంది తప్ప, తల్లిదండ్రులు సంబంధాలు కుదిర్చి పెళ్ళిచేసే పద్ధతి లేదు. వాళ్ళకి గోత్రాలు, కులాలు కూడాలేవు.

లవ్ మేరేజ్‌నే అంగీకరించని తరం వాణి తండ్రిది. కాలుజారితే తప్పనిసరి పరిస్థితుల్లో కలిగే వివాహమే లవ్ మేరేజ్ అన్నది వాణి తల్లి అభిప్రాయం కూడా. అలాంటి భావాలు గలవారికి తమ కూతురు డేటింగ్ చేయడం ఇష్టం ఉండదు.

1960లో అమెరికాలో వచ్చిన సెక్స్‌వల రివల్యూషన్ వల్ల అంతకు పూర్వంలా డేటింగ్ కేవలం నెకింగ్ దగ్గరే ఆగడంలేదన్నది కూడా వాళ్ళకి తెలుసు. (నెకింగ్ అంటే భుజాల పైభాగాల్లో ముద్దు పెట్టుకోవడం వరకే) గర్భనిరోధక మందుని రోజూ డేటింగ్ చేస్తున్న తన కూతురికి ఉదయం ఇచ్చే పాలలో కలిపి ఇవ్వడం చాలామంది అమెరికన్ టీనేజ్ తల్లులు చేస్తున్న పని అని కూడా వాళ్ళకు తెలుసు.

అమెరికాలో డేటింగ్ మాటున లైంగిక సంపర్కం సర్వసాధారణమైపోయింది. పదిహేనో ఏడు రాకుండానే తమ కన్యాత్వాన్ని కోల్పోయే అమ్మాయిల శాతం అరవైమూడు అని ఓ సర్వేలో తేలింది. అలాంటి కూతుళ్ళు గల తల్లిదండ్రులు ఇండియన్స్ కారు కాబట్టి, అమెరికన్స్ కాబట్టి వాళ్ళకి ఆ సంగతి తెలిసినా పట్టించుకోరు. బాధపడరు. కూతురి పాతివ్రత్యం మంటగలిసిందని ఏడవరు. పైగా గర్భం రాకుండా చూసుకో అని సలహా ఇస్తారు.

కానీ ఇండియానుంచి వెళ్ళిన వారికి ఇది ఎంతో బాధాకరమైన విషయం. అలాంటి సందర్భం తన కూతురికి రాకూడదని ఆశిస్తారు. దాంతో కట్టుదిట్టంలో ఉంచాలనుకుంటారు.

అయితే చిన్నప్పటినుంచి అమెరికన్ సంస్కృతిలో పుట్టి పెరగడంతో ఇండియన్ టీనేజర్స్‌కి అందులో ఎలాంటి తప్పు కనిపించదు. తమ తోటి స్నేహితులకి, ఇరుగుపొరుగుకి, క్లాస్‌మేట్స్‌కి తప్పుకానిది. తనకు మాత్రం ఎందుకు తప్పవ్వాలి? అన్న ప్రశ్న తడుతుంది.

వాణి కూడా అదే ప్రశ్న వేసింది తన తల్లిదండ్రులని.

అనేకమంది అమెరికన్స్‌లా వాణికి కూడా మ్యూజిక్ అంటే ఆసక్తి ఏర్పడింది. పియానో నేర్చుకుంటానని తండ్రితో చెప్పింది పన్నెండో ఏట. ఆమె క్లాస్‌మేట్ లిండా అక్కయ్య బెట్టీకి పియానో వచ్చు.

అమెరికాలో ఏదీ ఉచితం కాదు. ప్రతిదానికీ ఓ ధర ఉంటుంది. తండ్రికి ఏదయినా పని చేసి పెడితే ఏడేళ్ళ పిల్లాడు అందుకు తగ్గ రుసుము తీసుకుంటాడు. అక్కకి చెల్లెలు ఏదయినా చేయాలంటే డబ్బిచ్చుకోవాలి. వాళ్ళ మధ్య సంబంధాలన్నీ ఇలా ఆర్థికపరమైనవే తప్ప, అనురాగపూరితమైనవి కావు. (ఐశ్వర్యవంతుడు, పాప్ సింగర్ జాక్సన్ నాయనమ్మ దరిద్రంతో మగ్గుతోంది) అందుచేత అక్కడ కాలాన్ని ధనంతో కొలుస్తారు.

బెట్టి పియానో ట్యూషన్ చెప్పడానికి ఒప్పుకుంది. అయితే గంటకి పది డాలర్లు వారానికి రెండురోజుల్లో రెండు గంటలచొప్పున ఇరవై నాలుగు గంటలు నేర్చుకుంటే బేసిక్‌గా పియానో వాయించడం వస్తుంది.

ప్రతి గురు, సోమవారాలు సాయంత్రాలు ఆరున్నర గంటల నుంచి ఏడున్నర దాకా వాణి తల్లి కారులో ఇరవై నాలుగుమైళ్ళ దూరంలో వున్న బెట్టీ ఇంటికి తీసుకెళుతుంది. కారు దిగి వాణి బెట్టీ ఇంట్లోకి వెళ్ళేముందు పది డాలర్ల నోటు ఇస్తుంది. పాఠం అవగానే చెల్లించాలి. ఆ గంటసేపూ లక్ష్మి దగ్గరలో వున్న సూపర్ బజార్‌లో షాపింగ్ చేస్తుంది. గంట తర్వాత కూతుర్ని ఎక్కించుకుని ఇంటికి వస్తుంది. అక్కడ పరిచయమయ్యాడు వాణికి బెట్టీ తమ్ముడు. లిండా అన్నయ్య స్టేన్లీబాడ్ బరి.

సాధారణంగా అమెరికన్స్ బ్రౌన్ స్కిన్‌గల ఇండియన్స్‌తో పెద్దగా కలవరు. వాళ్ళు తమలా తెల్లతోలున్న వాళ్ళనే డేటింగ్‌కి పిలుస్తూంటారు. ముఖ్యంగా ఇండియన్స్ అయితే దూరంగా ఉంచుతారు.

ఇండియన్ టీనేజ్ కుర్రాడు అమ్మాయిని డేటింగ్‌కి తీసుకెళ్ళలేడు. రెండు వైపుల తల్లిదండ్రులూ అభ్యంతరం చెపుతారు కాబట్టి. అదీగాక, ఇండియన్స్ అమెరికన్స్‌తో డేటింగ్ చేయడం తన ఇండియన్ ఫ్రెండ్స్ సర్కిల్‌లో స్టేటస్ సింబలుగా కూడా భావిస్తూంటారు. వద్దన్నా కూడా చర్మం రంగులోని ఆధిక్యాన్ని మరవడం ఇండియన్స్‌కి కష్టం.

తన తోటి స్నేహితురాళ్ళందరూ డేటింగ్‌కి వెళుతుంటే తనకా అవకాశం లేనందుకు వాణి మానసికంగా ఎంతో మధనపడుతున్న రోజులవి.

శని, ఆదివారాలు గడిచాక సోమవారం స్కూల్లో తోటివాళ్ళు తమ డేటింగ్ గురించి. డేటింగ్ అనుభవాల గురించి మాట్లాడుకుంటుంటే మౌనంగా వినడం వాణికి ఎంతో బాధగా వుండేది.

"నేనెంత పిచ్చిదాన్నో తెలుసా? అది స్టికీ అఫైర్ అని నిన్నరాత్రి దాకా నాకు తెలియదు" ఓ అమ్మాయి తన అనుభవం చెప్పింది.

"నేనూ పిచ్చిదాన్నే. లోపల ఎముక ఉంటుంది అనుకునేదాన్ని కాని ఉండదని తెలిసింది" ఇంకో అమ్మాయి చెపుతుంది.

స్నేహితులవల్ల ఇన్‌ఫ్లుయన్స్ అయ్యే వయసు వాణిది. అంచేత స్టేన్లీ డేటింగ్‌కి పిలవగానే సరేనన్నది. బెట్టు కోసం కూడా నో అనలేదు.

డేటింగ్ చేసే కుర్రాళ్ళు ఇంటికి వచ్చి తల్లిదండ్రుల అనుమతితో తీసుకెళ్ళి, ఆడపిల్లల్ని మళ్ళీ ఇంట్లో వాళ్ళు చెప్పిన టైము దాటకుండా దింపాలి. అది నియమం. కానీ వాణి తనను ఇంట్లో కాక 'రౌండ్ ది కార్నర్'లో (సందు చివర) పికప్ చేయమని కోరింది.

అయితే స్టేన్లీని 'నెకింగ్' వరకే అనుమతించింది వాణి.

ఓ రోజు....

స్టేన్లీ తనిని డేటింగ్‌కి పిలవడం ఎంతో సంతోషాన్ని కలిగించింది వాణికి. శనివారం ఉదయం ఎనిమిదిన్నరకల్లా తయారై తన గదిలోని అద్దం ముందు నిలబడి ప్రతిబింబాన్ని చూసుకుంది.

జీన్స్ పేంట్ ఆమె క్లాస్‌మేట్ సుసాన్ చెప్పింది. డేటింగ్‌కి స్కర్టు కంటే జీన్స్ పేంట్ బెటరని, చేతులుపడ్డ ప్రతిచోటా చర్మానికి అడ్డంగా అది ఉంటుంది కాబట్టి రెడ్ అండ్ బ్లాక్ చెక్స్ ఫుల్ హేండ్‌షర్ట్, పింక్ హేండ్ బేండ్ పెట్టుకుని లూజుగా వదిలేసిన జుట్టు, నుదుటబొట్టు. తండ్రి గదిలోకి వెళ్ళి ఆయన వాడే పెర్ఫ్యూమ్‌ని రెండు చంకల్లో చల్లుకుంది.

"మమ్! ఐ వోంట్ బి హోమ్ ఫర్ లంచ్" చెప్పింది.

"ఎక్కడికి వెళుతున్నావ్?" అడిగింది వాణి తల్లి లక్ష్మి.

"సుసాన్స్ ప్లేస్. షి ఇన్ వైటెడ్ మి"

"డోంట్ బి ఏన్ ఇడియట్. తెలుగులో అడుగుతున్నాను. తెలుగులో సమాధానం చెప్పలేవూ?" అరిచింది లక్ష్మి.

"మమ్మీ నీవు శుద్ధ మొద్దు స్వరూపానివి. తెలుగులో తిట్టలేవూ" అరిచింది వాణి బదులుగా.

చిన్నగా నవ్వాడు వెంకటేశ్వరరావు కూతురు మాటలకి.

"చూడు లక్ష్మీ నీ కెన్నిసార్లు చెప్పాను. ఇడియట్, రాస్కెల్‌లాంటి ఇంగ్లీష్ పదాలతో తిట్టద్దని. శుభ్రంగా శుంఠ అని తిట్టొచ్చుగా? జంధ్యాల కేసెట్లు చూసినవే మళ్ళీ మళ్ళీ వేసుకుని చూస్తావు. ఎందుకు? తెలుగు తిట్లు ఒంటబట్టకపోతేను"

"జంధ్యాల ఉపయోగించే తిట్లు మొగాళ్ళు మొగాళ్ళని తిట్టేవాయే. శుంఠకి స్త్రీ లింగం ఏంటండి?"

"శుంఠేశ్వరి అనుకుంటా"

"ఏడ్చినట్లుంది. అది తిట్టుకాదు. శుంఠలకి ఈశ్వరి పొగడ్త ఆవుతుంది."

"కాదు. కావాలంటే ఈసారి ఇండియా వెళ్ళినప్పుడు ఆయనకి ఫోన్ చేసి అడుగు."

"మమ్. ఐ యామ్ ఆఫ్ .. ఐ మీన్ వెళ్తున్నాను." తల్లిదండ్రులను చర్చలో వదిలి వాణి బయటికి జారుకుంది.

ఠంచన్‌గా చెప్పిన సమయానికి వచ్చాడు స్టేన్లీ. కారు ముందు తలుపు తెరిచాడు. డ్రైవింగ్ సీట్లో స్టేన్లీ.. అతనికి కుడి పక్క కూర్చున్నాక కారు బయలుదేరింది.

"ఐ వజ్ రేదర్ అఫ్రైడ్ యు వుడ్ నాట్ కం" చెప్పాడు స్టేన్లీ ఓసారి వాణివంక చూసి.

"వస్తానని మాటిచ్చాగా?" ఇంగ్లీష్‌లో చెప్పింది.

"యు ఆర్ ఏ స్టన్నింగ్ బ్యూటీ"

వెంటనే వాణి బుగ్గలు కెంపులయ్యాయి. అతను తన ఛాతీవంక చూస్తుండడం గమనించాక యింకాస్త ఎరుపెక్కాయి బుగ్గలు.

"థాంక్ యూ" చెప్పింది.

ఆమె జీవితంలో 'నువ్వు అందంగా ఉన్నావు' అని ఓ మగాడు చెప్పడం ఆమెకి అదే తొలి అనుభవం కాబట్టి ఎంతో గర్వంగా, ఆనందంగా అనిపించింది.

"ఎక్కడి కెళుతున్నాం?" అడిగింది బయటకు చూసి.

"ఎనీ సజెషన్స్?"

"నన్."

"హేడ్ యువర్ బ్రేక్‌ఫాస్ట్?" అడిగాడు.

"ఎస్."

"లాంగ్ డ్రైవ్ ఓకే?"

"సూట్స్ మి ఫైన్."

సెయింట్ లూయీకి డెబ్బై మైళ్ళ దూరంలో మిసిసిపి నది ఒడ్డున వున్న ఓ నేషనల్ పార్క్‌లోకి గంటం పావు తర్వాత చేరుకుంది వాళ్ళకారు. కారు దిగి ఎంట్రన్స్ ఫీజు చెల్లించి మళ్ళీ వచ్చి కూర్చున్నాడు.

ఏడెకరాల విస్తీర్ణంలోగల ఆ పార్క్ అమెరికాలో వున్న అలాంటి కొన్ని వందల పార్కుల్లో ఒకటి. వీకెండ్‌కి వచ్చిన వాళ్ళతో సందడిగా వుందది. కారును రోడ్డుపక్క ఆపాడు స్టేన్లీ.

ఎదురుగా మిసిసిపి నది. అందులో మరపడవలు, తెడ్డుతో నడిపే బోటింగ్ హాబీ గలవారి పడవలు. ఎటుచూసినా దట్టమయిన చెట్లు, రంగు రంగుల పూలు. నల్లటి మృదువయిన తారురోడ్డు.

ఇద్దరూ నది ఒడ్డున ఉన్న ఎర్రరంగు చెక్క బెంచీమీద కూర్చున్నారు.

కూర్చున్న కొన్ని నిముషాలకి స్టేన్లీ వాణి చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. వాణి అతని భుజం మీద తలవాల్చి నీళ్ళవంక చూడసాగింది. సుసాన్ మొదటి డేట్‌తో అదే చేశానని చెప్పడంతో, వాణికి ఏం చేయాలో గైడెన్స్ దొరికింది.

"మంచి వాసన వేస్తున్నావు"

"మా నాన్నగారు వాడే కోరస్ సెంటది."

"అదికాదు. నీ చర్మం నుంచి వచ్చే వాసన."

"నేను వాసన వేయను. సబ్బు అది."

"నా డ్రీమ్ గర్ల్‌వి నువ్వు. తెలుసా?"

"ఎందుకని?"

"నల్లకళ్ళు, నల్ల జుట్టు, గోధుమరంగు చర్మం."

"ఏషియన్ గర్ల్ నీ డ్రీమ్ గర్ల్ ఎందుకయింది?" అడిగింది వాణి.

స్టేన్లీ ఆమె నొసటిమీద మృదువుగా రాస్తూంటే ఎంతో హాయిగా వుంది వాణికి.

"మీ సంస్కృతి."

"వివరించు."

"మగాళ్ళు ఎలాంటివారయినా ఆడవాళ్ళు సర్దుకుపోయి అణుకువగా వుంటారు కాబట్టి."

"అవును. మా నాన్న, అమ్మ డేటింగ్‌కి అసలు వెళ్ళనే లేదట.

పెళ్ళి చూపుల్లో మొదటిసారి చూసుకున్నారుట. రెండోసారి పెళ్ళిపందిట్లోనే మళ్ళీ ఒకర్నొకరు చూసుకోవడం."

"ఆశ్చర్యకరం. ఒకర్నొకరు అర్థం చేసుకోకుండా ఎలా వివాహానికి వప్పుకున్నారు?" అడిగాడు స్టేన్లీ.

"నాకూ ఆశ్చర్యమే. మా అమ్మని ఆ విషయం అడిగితే 'అవన్నీ మనకి సరిపడవు' అన్నది."

"మీ అమ్మకి తెలుసా నాతో వస్తున్నావని?"

"ఊహూ."

"అనుకున్నాను. ఇంతదాకా నిన్నెవరయినా ముద్దు పెట్టుకున్నారా?"

"మా అమ్మా, నాన్న... అక్కా."

"ఐ మీన్."

"నో!"

"మే ఐ?"

"నో!"

"ఎందుకని?"

జవాబు చెప్పలేదు వాణి. సుసాన్ చెప్పింది. డేటింగ్‌లో మొదటిరోజు ముద్దుకు అనుమతి ఇవ్వకూడదని, ఇస్తే అలుసయిపోతామని జూడీ చెప్పింది. మొదటిసారి అనుమతి యివ్వకపోతే రెండోసారి గారంటీగా డేటింగ్‌కి తీసుకెళతాడని. మూడోసారి కూడా 'నో' అన్నా నాలుగోసారి డేటింగ్‌కి తీసుకెళితే అది ప్రేమని, మళ్ళీ ఫోన్ చేయకపోతే కేవలం 'గుడ్ టైం' కోసం వచ్చిన ప్లేబోయ్ అని.

"మే ఐ?"

"నో ప్లీజ్?"

"ఓ.కే. నీకిష్టమైనప్పుడే"

ఇద్దరూ కాసేపు నదిలో తిరిగే పడవ వంక చూస్తూండిపోయారు.

"మీ ఇండియా ఎలా వుంటుంది?"

"నాట్ ఫేషనబుల్, బట్ గుడ్"

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**